క్లుప్తంగా

శ్రీవారికి పంచామృతాభిషేకం



వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీకాలనీ సెక్టార్ – 6లోని వేంకటేశ్వర స్వామి, ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో 30వ వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. స్వామి వారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకంతో పాటు చతుస్థానార్చన, నిత్య పూర్ణాహుతి శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ప్రతిష్టా వార్షిక కల్యాణాన్ని కనులపండువగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగిన వేడుకల్లో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి



తోటగరువు హైస్కూల్‌లో ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరి

ఆరిలోవ: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని శాసన మండలికి యూటీఎఫ్ బలపరిచిన ఉత్తరాంధ్ర ఉపాధ్యాయుల అభ్యర్థి కోరెడ్ల విజయగౌరి అన్నారు. ఆమె శుక్రవారం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఉపాధ్యాయులను కలిసి తనను శాసన మండలికి ఎన్నుకోవాలని అభ్యర్థించారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకపోవడం వల్ల ప్రస్తుతం పనిచేస్తున్న ఉపాధ్యాయులపై పని ఒత్తిడి పడుతోందన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్, ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన ఫిల్మ్ ఫెస్టివల్



మాట్లాడుతున్న సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు

సీతంపేట: వైజాగ్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో మూడు రోజులుగా జరుగుతున్న తెలుగు ఫిల్మ్ ఫెస్టివల్ శుక్రవారం ఘనంగా ముగిసింది. ముగింపు సందర్భంగా నా ఆటోగ్రాఫ్ సినిమాను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సొసైటీ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ తెలుగు సినిమా దినోత్సవాన్ని 24 క్రాఫ్ట్స్‌కు చెందిన వారు, సంస్థలు, ప్రభుత్వం కలిసి పెద్ద ఎత్తున జరపాలన్నారు. పరిశ్రమ అభివృద్ధికి దోహదపడిన వారిని గుర్తు చేసుకోవాలని సూచించారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ప్రతనిధులు వచ్చే ఏడాది నుంచి ఘనంగా జరుపుతామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హుస్సేన్, చాట్ల బాబూరావు, బొబ్జి, సుధాకర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శోభారాణి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

- కంబాలకొండ పార్కుకు మోక్షం
- చురుగ్గా ఆధునికీకరణ పనులు



కంబాలకొండలో నిర్మాణంలో ఉన్న పగోడాలు



జూ పార్కు ఎదురుగా నర్సరీ నుంచి కంబాలకొండ లోపలికి నిర్మిస్తున్న రహదారి

ఆరిలోవ: ప్రముఖ పర్యాటక కేంద్రం కంబాలకొండ ఎకో టూరిజం పార్కుకు ఎట్టకేలకు మోక్షం కలుగుతోంది. దశాబ్దానికి పైగా శిథిలావస్థకు చేరిన ఈ పార్కు ఆధునికీకరణపై అటవీశాఖ అధికారులు దృష్టి సారించడంతో కొద్ది రోజులుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. కొన్నింటికి మరమ్మతులు చేపడుతుండగా.. మరికొన్నింటిని కొత్తగా నిర్మిస్తున్నారు. దీంతో పార్కు రూపురేఖలు మారుతున్నాయి.

సుమారు 200 ఎకరాలలో 20 సంవత్సరాల క్రితం ఇక్కడి పర్యావరణానికి ఇబ్బంది కలగకుండా అటవీశాఖ అధికారులు ఎకో టూరిజం పార్కును ఏర్పాటు చేశారు. అప్పట్లో పలు రకాల పక్షులు సందర్శకులను అలరించేవి. పార్కులో సందర్శకులకు వసతులు కల్పించారు. క్రమేణా ఆ వసతులు కనుమరుగయ్యాయి.

దశాబ్దానికి పైగా నిరక్ష్యం..

సందర్శకులను ఎంతగానో ఆకర్షించే కంబాలకొండ ఎకోటూరిజం పార్కు శిథిలావస్థకు చేరి పది సంవత్సరాలకు పైగా దాటింది. హుద్‌హుద్ తుఫాన్ ధాటికి ఇది మరింత శిథిలమైంది. ఇక్కడ కాటేజీలు వినియోగానికి పనికిరాకుండా పోయాయి. విశ్రాంతి షెల్టర్లు సైతం నేలకొరిగాయి. హుద్‌హుద్ తుఫాన్‌కు చిన్నాభిన్నం కావడంతో ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు ఈ పార్కును సందర్శించి పునరాభివృద్ధి కోసం రూ.12 కోట్లు నిధులు కేటాయించారు. ఆ నిధులను అటవీశాఖ అధికారులు వినియోగించకుండా వదిలేయడంతో ఇంతవరకు ఈ పార్కు నిర్లక్ష్యానికి గురైందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కు శిథిలావస్థకు చేరడం, సౌకర్యాలు లేకపోవడంతో కార్తీక మాసంలో సైతం దీన్ని సందర్శించేవారు కరువయ్యారు. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి ప్రస్తుతం ఇక్కడ అభివృద్ధి పనులు చేపడుతుండటంతో సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మరెన్నో వసతులు..

- సందర్శకుల కోసం ఐదు చోట్ల కొత్తగా రచ్చ బండలు నిర్మిస్తున్నారు.
- పలుచోట్ల శిథిలమైన విశ్రాంతి షెల్టర్లకు మరమ్మతులు చేపడుతున్నారు.
- హైవే పక్కన జూపార్కు ఎదురుగా ఉన్న నర్సరీ గేటు లోపల నుంచి నేరుగా సందర్శకులు కంబాలకొండ లోపలికి రావడానికి కొత్తగా మట్టి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారు.

'కూల్' క్యాంటీన్

కంబాలకొండ ఎకోటూరిజం పార్కులో క్యాంటీన్‌ను ఆధునికీకరిస్తున్నారు. సందర్శకుల కోసం పార్కు మధ్యలో నిర్మించిన ఈ క్యాంటీన్ శిథిలం కావడంతో పునరుద్ధరణ పనులు చేపట్టారు. క్యాంటీన్‌లో చల్లని వాతావరణం ఉండేలా పైకప్పును పూర్తిగా గడ్డితో ఏర్పాటు చేశారు. ఫ్లోర్ కోసం పలకలు అమర్చుతున్నారు.



ఆధునికీకరిస్తున్న క్యాంటీన్



పునరుద్ధరిస్తున్న కాటేజీలు

చకచకా కాటేజీల నిర్మాణం

ఇక్కడ గతంలో ఐదు కాటేజీలు ఉండేవి. అవన్నీ శిథిలమయ్యాయి. క్యాంటీన్ సమీపంలో ఉన్న మూడు కాటేజీలకు మరమ్మతులు చేపట్టి పైకప్పు, ఫ్లోర్ మార్చుతున్నారు. బోటింగ్ కొలను ఎదురుగా ఉన్న రెండు కాటేజీలను పూర్తిగా తొలగించారు. వాటి స్థానంలో కొత్త కాటేజీలు నిర్మిస్తున్నారు.

అందాలు కనువిందు చేసేలా..



కంబాలకొండలో నిర్మిస్తున్న ఉడెన్ డెక్‌లు

క్యాంటీన్ పక్కన, బోటింగ్ కొలను ఒడ్డున రెండు ఉడెన్ డెక్‌లు (మంచ్‌లు) నిర్మిస్తున్నారు. వీటి కోసం నాణ్యమైన పాచి కలప ఉపయోగిస్తున్నారు. వీటి పైకి ఎక్కిన సందర్శకులకు కంబాలకొండ అందాలు కనువిందు చేయనున్నాయి.



నిర్మాణంలో ఉన్న రచ్చబండ

వినోదం పంచే 'యాంఫీ థియేటర్'

క్యాంటీన్ ఎదురుగా యాంఫీ థియేటర్‌ను ఆధునికీకరిస్తున్నారు. వినోదం, ప్రదర్శనల కోసం ఉపయోగించే ఈ బహిరంగ వేదిక చుట్టూ కొద్ది ఎత్తులో గోడలు, సందర్శకులు కూర్చునేందుకు వీలుగా బెంచీల మాదిరిగా నిర్మాణం చేపడుతున్నారు.



నిర్మాణ పనులు జరుగుతున్న యాంఫీ థియేటర్

ఆలోచింపజేసిన 'మేమూ మనుషులమే..'



నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం: విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మద్దిలపాలెంలోని కళాభారతి ఆడిటోరియంలో శుక్రవారం ప్రదర్శించిన 'మేమూ మనుషులమే' నాటిక ఆద్యంతం ఆకట్టుకుంది. ఈ ప్రదర్శనను కళాభారతి ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎస్.ఎన్.రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. జన్యు లోపం వల్ల మగాడిగా పుట్టి, ఆడపిల్ల లక్షణాలతో పెరిగిన వాడిని చూసి లోలోపల కుంగిపోతున్న కన్నవారిని చూసి, పారిపోయి హిజ్రాలతో కలిసిపోయి స్త్రీగా మారిన ట్రాన్స్‌జెండర్ జీవన గాథ ఆకట్టుకుంది. రావి నాగేశ్వరరావు కలం నుంచి జాలువారిన కథకు సంధ్య దర్శకత్వం వహించగా, నాటికలో ప్రతీ సన్నివేశాన్ని కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరించి నాటకప్రియులను రంజింపజేశారు కళాకారులు. యాచక వృత్తిపై ఆధారపడి, పండగలకు, పబ్బాలకు డ్యాన్స్ చేస్తూ.. పుట్టిన పిల్లలను ఆశీర్వదిస్తూ వారు ఇచ్చిన కానుకలను తీసుకుని ట్రాన్స్‌జెండర్స్ బతుకుతున్న తీరును నాటికలో చక్కగా వివరించారు. నిజమైన హిజ్రాలకు గుర్తింపు కావాలి.. మేము మనుషులమే అని గుర్తించాలి.. మా నుంచి యాచక వృత్తిని దూరం చేయండంటూ వల్లి పాత్ర ద్వారా ఆలోచింపజేశారు.

వెట్టి చాకిరీ నిర్మూలిద్దాం



మహారాణి పార్లర్ కూడలిలో విద్యార్థుల మానవహారం



కార్యక్రమంలో జేసీఎల్ రామారావు, డీసీఎల్ సునీత తదితరులు

సీతంపేట: వెట్టి చాకిరీ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జాయింట్ లేబర్ కమిషనర్ ఎం. రామారావు కోరారు. వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలన వారోత్సవాలలో భాగంగా శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్‌రోడ్‌లో గల కార్మిక శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ వ్యవస్థ నిర్మూలనకు కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేయాలన్నారు. కార్మిక శాఖ కార్యాలయం నుంచి మహారాణి పార్లర్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం మానవహారం చేపట్టారు. వెట్టి చాకిరీ నిర్మూలన, శిశు హక్కుల పరిరక్షణపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లేబర్ కమిషనర్ ఎం.సునీత, ఏసీఎల్‌లు గోవిందు, రాజు, సహాయ కార్మిక అధికారులు, జిల్లా న్యాయ సేవా సమితి, ఐజేఎం, నేచర్, సీఈఎఫ్‌హెచ్‌ఏ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వీయ రక్షణతోనే వ్యాధుల నివారణ



కృష్ణాగార్డెన్స్‌లో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న మలేరియా విభాగం సూపర్‌వైజర్ మురళి



మిరపకాయల వీధిలో మంచినీటి డ్రమ్ముల్లో దోమ లార్వాలు గుర్తిస్తున్న ఆశ వర్కర్

అల్లిపురం: వారంలో ఒక రోజు డ్రైడే పాటించాలని భీమ్‌నగర్ మలేరియా సూపర్‌వైజర్ మురళీ సూచించారు. ఫ్రైడే డ్రైడేలో భాగంగా శుక్రవారం భీమ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి కృష్ణా గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో సిబ్బందితో కలసి అవగాహన కార్యక్రమం చేపట్టారు. మంచి నీటి నిలువ ఉంచే డ్రమ్ములు వారంలో ఒక రోజు ఖాళీ చేయాలని, వాటిని ఆరనిచ్చిన తర్వాత మరుసటి రోజు నీటిని నిలువ చేసుకోవాలన్నారు. ఇంటి పరిసరాల్లో మురునీరు నిలువ లేకుండా చూసుకోవాలన్నారు. మనీప్లాంటు వంటి మొక్కల గోలాల్లో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. తద్వారా దోమల లార్వాలు అభివృద్ధి చెందకుండా ఉంటాయన్నారు. ఇంటి ఆవరణలో తాగి వదిలేసిన కొబ్బరి బొండాలు, పాత టైర్లు ఉండకుండా చూసుకోవాలన్నారు. తద్వారా జ్వరాలు రాకుండా నివారించవచ్చన్నారు.

కొబ్బరితోట పీహెచ్‌సీ పరిధిలో..

కొబ్బరితోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధి మిరపకాయలవీధిలో ఫ్రైడే డ్రైడేపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటికి ఆశ వర్కర్ లీలావతి వెళ్లి మంచినీటి డ్రమ్ముల్లో దోమల లార్వాలు గుర్తించే పని చేపట్టారు. పరిసరాల పరిశుభ్రత కోసం అవగాహన కల్పించారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఏయూక్యాంపస్: పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవడం వలన ఆరోగ్యం మెరుగవుతుందని పోషకాహార నిపుణురాలు షీలా కృష్ణస్వామి అన్నారు. బీచ్‌రోడ్డులోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. ఆరోగ్యం-పోషకాలు పరస్పరం ఆధారంగా సాగుతాయన్నారు. కాలిఫోర్నియా బాదంలో 15 రకాల పోషకాలు ఉంటాయని, గుండె ఆరోగ్యానికి సైతం బాదం మంచిదని పేర్కొన్నారు. వందలాది పరిశోధనలు బాదం గుణాలను, ప్రాముఖ్యతను శాస్త్రీయంగా అధ్యయనం చేసి ఫలితాలను అందించాయన్నారు.

బాలికకు న్యాయం చేయాలి



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న కార్మికులు

సీతమ్మధార: సింహాద్రిపురంలో నివాసం ఉంటున్న బాలికపై అత్యాచారం జరిగిన ఘటనను నిరసిస్తూ జీవీఎంసీ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రదర్శన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పి.మణి మాట్లాడుతూ ఎంవీపీ పోలీసు స్టేషన్ పరిధిలో బాలికపై జరిగిన అత్యాచార ఘటనపై రాష్ట్ర హోం మంత్రి, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పందించాలని, బాధిత బాలికకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వెంటనే నిందితునికి కఠిన శిక్ష వేయాలన్నారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జీవీఎంసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విశాఖ జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, అధ్యక్షుడు నూకరాజు, జె.ఆర్. నాయుడు, అనిల్, సురేష్ ఆదినారాయణ, శ్రావణ్, కుమారి, హేమలత, కొండమ్మ, అనిత పాల్గొన్నారు,

జాతీయ కబడ్డీ పోటీలకు ముమ్మర శిక్షణ

ప్రత్యేక ఆకర్షణగా యువ సిరీస్ ప్రో కబడ్డీ క్రీడాకారులు



శిక్షణలో భాగంగా క్రీడాకారుల మధ్య హోరాహోరీగా జరుగుతున్న పోటీ

ఎంవీపీకాలనీ: ఒడిశాలోని కటక్ వేదికగా జరగనున్న 71వ జాతీయ కబడ్డీ పోటీలకు ఆంధ్రప్రదేశ్ జట్టు ఎంపికలో భాగంగా పెదవాల్తేర్‌లో నిర్వహిస్తున్న శిక్షణ శుక్రవారం హోరాహోరీగా సాగింది. ఇక్కడ ఎంపికైన జట్టు క్రీడాకారులు ఈ నెల 20 నుంచి 23వ తేదీ వరకు కటక్‌లో జరిగే జాతీయ పోటీలలో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో క్రీడాకారులకు అత్యుత్తమ శిక్షణ అందించేందుకు విశాఖ కబడ్డీ అసోసియేషన్ విస్తృత కృషి చేస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి జేఎస్‌వీ ప్రసాదరెడ్డి తెలిపారు. గత రెండు రోజులుగా జరుగుతున్న ఈ శిక్షణలో భాగంగా క్రీడాకారులకు పలు అంశాల్లో ప్రత్యేక తర్ఫీదు ఇస్తున్నామన్నారు. శుక్రవారం జరిగిన శిక్షణకు ఇటీవల యువ సిరీస్ ప్రో కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఆటగాళ్లు పి.గోపీచంద్, పీవీ దుర్గారావు, జి.నరసింహారెడ్డి, పి.తేజేష్ హాజరై, ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ శిక్షణకు స్థానిక గ్రామస్తులు, నగర క్రీడాకారుల నుంచి మంచి ప్రోత్సాహం లభిస్తోందన్నారు. త్వరలోనే జాతీయ పోటీల్లో పాల్గొనే జట్టును ప్రకటించనున్నట్లు తెలిపారు.

రేపు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి



జయగోపాల్ చిత్ర పటం వద్ద నివాళులు అర్పిస్తున్న నాస్తికవాదులు

ఆరిలోవ: ప్రసిద్ధ హేతువాది, భారత నాస్తిక సమాజం, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ జయగోపాల్ ప్రథమ వర్ధంతి ఈనెల తొమ్మిదో తేదీ ఉదయం పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు భారత నాస్తిక సమాజం కేంద్ర కమిటీ నాయకులు టి. శ్రీరామమూర్తి, జె. రవి తెలిపారు. శుక్రవారం ఆరిలోవలో ఉన్న కేంద్ర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా జయగోపాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. బాల్యం నుంచి సమాజంలో నెలకొన్న మూఢ నమ్మకాలను వ్యతిరేకించిన జయగోపాల్ అంతర్జాతీయ స్థాయి నాయకులని, ఆయన చేసిన సేవలకు అనేక సంస్థలు అవార్డులు కూడా ఇచ్చాయన్నారు, చిన్నతనంలోనే అనేక మత గ్రంథాలను విశ్లేషించిన మేధావి అని, పెరియార్ ఈవీ రామసామి, అంబేడ్కర్, రాబర్ట్ గ్రీన్ ఇంగర్సాల్ వంటి ప్రముఖులు ఆయనకు ఆదర్శమని తెలిపారు. ఈ వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా రైటర్స్ అకాడమీ చైర్మన్, లీడర్ దినపత్రిక ఎడిటర్ రమణమూర్తి, ప్రముఖ విప్లవ కవి కుమారుడు ఉదయ్ భాస్కర్ హాజరవుతారని, వక్తలుగా భారత నాస్తిక సమాజం నాయకులు సాయిని నరేందర్, టి. శ్రీరామ్మూర్తి, సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ తెలంగాణ నాయకులు వేదాంత మౌర్య, ఇతర ప్రజా సంఘాల నాయకులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా జయగోపాల్‌పై రాసిన పాటను విడుదల చేయనున్నట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సైంటిఫిక్ స్టూడెంట్ ఫెడరేషన్ కన్వీనర్ రాజా, సంతోష్, సునీత, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

పుచ్చకాయలొచ్చేశాయ్..



ఏయూక్యాంపస్: వేసవి తాపం అప్పుడే ప్రారంభమైంది. వారం క్రితం వరకు గిలిగింతలు పెట్టిన చలి కనుమరుగైంది. రథసప్తమి వెళ్లడంతో భానుడు అప్పుడే తన ప్రభావం చూపడం ఆరంభించాడు. దీంతో ఉష్ణతాపం నుంచి ఉపశమనాన్నిచ్చే ఫలాలు కూడా అందుబాటులోకి వచ్చేశాయి. వేసవి ఫలాల్లో ఒకటైన ఖర్బూజా (వాటర్ మిలన్) విక్రయాలు నగరంలో పలు చోట్ల అప్పుడే ప్రారంభమయ్యాయి. రైల్వే న్యూ కాలనీ మార్గంలో వ్యాపారులు ఈ పుచ్చకాయలను చిన్న డేరాల కింద ఉంచి విక్రయిస్తున్నారు. ప్రజలు వీటిని కొనడానికి ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ప్రారంభ సమయం కావడంతో కిలో రూ.25 నుంచి 30 వరకు విక్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో పండు సైజును బట్టి రూ.100 నుంచి రూ.200 వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. మరికొన్ని చోట్ల ముక్కలుగా కోసి ఒక్కో ముక్క రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు.